# మిసెస్ పరాంకుశం

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



*1971 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన రెండవ నవల*

*(కిందటి సంచిక నుంచీ కొనసాగింపు)*

### 4

**మర్నాడు ఉదయం** ఎప్పటిలా అమ్మాజీ వస్తుందనుకున్నాడు పరాంకుశం. రాలేదు. క్రితం రాత్రి కూడా రాకపోవటం వల్ల అమ్మాజీకి బాగా కోపం వచ్చి ఉండవచ్చు అనుకున్నాడు. తన కుటుంబ సభ్యులకి కూడా చెప్పిందా? అది ఊళ్ళో అందరికీ సర్క్యులేట్ అవుతోందా?

ఆఫీస్‌కు బైలుదేరుతుంటే, ఎక్కడికో వెళ్ళడానికి రోడ్డుమీదకు వచ్చిన అమ్మాజీని చూసి పిలిచాడు.

"అమ్మాజీ, పొద్దున్న పేపర్ కోసం రాలేదే?"

"ఊరికినే." అన్నది.

"ఓసారి రారాదూ?" అడిగాడు.

"దేనికి?"

"ఊరికినే."

సమాధానం ఇవ్వకుండా వెళ్ళిపోయింది.

పరాంకుశానికి ఆఫీసులో రెండు ఫోన్ కాల్స్ వచ్చాయి. ఒకటి - పోలీస్ ఇన్‌స్పెక్టర్ నుంచి. మంచి ఇల్లు ఒకటి చూశానని, సాయంత్రం వచ్చి చూసుకుని బాగుంటే ఎడ్వాన్స్ ఇచ్చి చేరిపోవచ్చనీ.

సాయంత్రం ఆఫీస్ నుంచి సరాసరి శ్రీకంఠంతో స్టేషన్‌కి వెళ్ళి ఇన్‌స్పెక్టర్‌తో సహా ఆ ఇల్లు చూసేటట్లుగా ఏర్పాట్లు చేసుకున్నాడు, అంత త్వరగా ఇల్లు సంగతి చూస్తాడనుకోలేదు ఇన్‌స్పెక్టర్.

రెండవ ఫోన్ కాల్ టెలిగ్రాఫ్ ఆఫీస్ నుంచి, పరాంకుశం అక్కయ్య మర్నాడు ఉదయం బస్సులో వస్తున్నట్లుగా సాయంత్రం టెలిగ్రాఫ్ ఆఫీస్‌నుంచి టెలిఫోన్ చేసి చెప్పారు. అతని బావ ఆఫీస్ ఫోన్ నంబరుకి టెలిగ్రామ్ ఇవ్వడం వల్ల.

పరాంకుశం చాలా సంతోషపడ్డాడు ఆ వార్త విని. తన ఉత్తరం ఆ రోజే అంది ఉంటుంది. ఆలస్యం చెయ్యకుండా బావ అక్కయ్యను వెంటనే పంపిస్తున్నాడు.

సాయంత్రం శ్రీకంఠంతో పాటు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాడు పరాంకుశం. ఇన్‌స్పెక్టర్‌తో కలిసి, పోలీస్ జీపులో ఇల్లు చూడటానికి బయలుదేరారు.

"థౌజండ్ థాంక్స్. ఇంత త్వరగా ఇల్లు చూస్తారనుకోలేదు." చెప్పాడు పరాంకుశం.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ నవ్వి అన్నాడు.

"నాటెటాల్, అట్టే శ్రమపడకుండానే దొరికింది ఇల్లు. ముఖ్యంగా సౌదామిని ఎంత త్వరగా బయటపడితే అంత మంచిదని నా అభిప్రాయం. అందుకు ఇల్లు అన్నిటికన్నా ముందు ముఖ్యం."

"రేపు ఉదయం మా అక్కయ్య కూడా వస్తోంది. నాలుగయిదు నెలలు మా దగ్గరే ఉంటుంది, సౌదామినికి ట్రయినింగ్ ఇచ్చేందుకు రమ్మని కోరాను."

"ఈజ్ ఇట్? గుడ్ ఐడియా."

"ఇల్లుతో పాటు ఎవరిదయినా దక్షత ఉండాలి కదా కొత్తల్లో."

"మీ బావగారికి తెలుసా ఇది?"

"తెలుసు. ఆయన నన్ను ప్రోత్సహించిన వాళ్ళలో ఒకరు."

ఓ పెద్ద సందులో ఆగింది జీప్. ఇంటి ముందు ముగ్గురూ దిగారు. గేటు తెరచుకుని లోపలికి నడిచారు. గేటు నుంచి ఇంటికి ఏభై గజాల దూరం. మధ్య ఇంటి వైపున్న చిన్న కాలిబాటకి అటు ఇటు పూల మొక్కలు చెట్లు ఉన్నాయి.

పెంకుటిల్లు. మూడు గదులు, మూడు పెద్ద గదులే. ఇంటి వెనకాల ఖాళీ స్థలం. అందులో పూల మొక్కలు, చెట్లు ఓ రావి చెట్టు నీడలో బావి.

ముగ్గురూ బావి నీళ్ళు రుచి చూశాడు తియ్యగానే ఉన్నాయి. స్వతంత్రంగా, ప్రశాంతంగా దాదాపు ఓ కుటీరంలా ఉంది ఆ ఇల్లు.

"ఐడియల్ హౌస్." చెప్పాడు శ్రీకంఠం.

"బాగుంది. ఎంత అద్దె?" అడిగాడు పరాంకుశం.

"ఎనభై రూపాయలు."

"ఎడ్వాన్స్ ఇచ్చి రేపే ప్రవేశిస్తాను." చెప్పాడు పరాంకుశం.

"అయితే తాళం చెవి మీదగ్గరే ఉంచండి."

జీప్‌లో కూర్చున్నాక ఇన్‌స్పెక్టర్ పరాంకుశానికి ఆ ఇంటి తాళం చెవిని అందించాడు. ప్రక్క సందులో ఉన్న ఆ ఇంటి యజమానితో మాట్లాడి అద్దె ఎడ్వాన్స్ ఇచ్చి ఇంటికి బయలుదేరాడు పరాంకుశం.

సందు మొదట్లోనే కనబడ్డాడు ఎదురింటి అతను కిళ్ళీ కొట్టు దగ్గర. కొర కొరా చూశాడు పరాంకుశం వంక. గది తలుపు తాళం తీస్తూ ఇంట్లోకి వెళుతున్న అమ్మాజీని చూసి చెప్పాడు పరాంకుశం.

"ఓసారి వస్తావా?"

పావుగంట తర్వాత వచ్చింది అమ్మాజీ.

"దేనికి నా మీద కోపం?" అడిగాడూ నవ్వుతూ.

"మీమీద కోపం తెచ్చుకోవడానికి నేనెవర్ని?"

"అలా అనడంలోనే కనబడుతోంది కోపం. ఇదివరకు ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు నువ్వు."

"నాకేం కోపం లేదు."

"సరే అయితే. నిజం చెబుతావనుకున్నాను, చెప్పుదామనుకున్నా నేను ఎలాగూ రేపు ఉండను."

"ఏం?"

"ఖాళీ చేస్తున్నాను."

అమ్మాజీ ఉలిక్కిపడి నిజమా అన్నట్లుగా పరాంకుశం వంక చూసింది.

"దేనికి ఖాళీ చేయడం? ఇక్కడ బాగోలేదా?"

"ఇన్నాళ్ళు లేనిది ఇప్పుడు కొత్తగా బాగుండనిది ఏం లేదు. ఇక ముందు నన్నీ ఇంట్లో ఉండనీరు కాబట్టి. ఉన్నా మీకు బాగుండదు. ఎందుకో చెప్పనా?"

ప్రశ్నార్థకంగా చూసింది.

"ఉత్తరం చూసావుగా. నా పెళ్ళాం మీ లాంటివాళ్ళ మధ్య ఉండటం మీరు సహించలేరు. నన్ను, నా భార్యను ద్వేషిస్తారు. ముందరే వేరుపడటం మంచిదని."

అమ్మాజీ నిలబడలేక కుర్చీలో కూర్చుంది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏడుస్తున్నావా?" అడిగాడు.

"నేనేం తీసిపోయాను? నా కన్నా ఆ బజారు..." వెక్కి వెక్కి ఏడుస్తోంది

ఆమె వంక జాలిగా చూసాడు పరాంకుశం.

"ఇంతకన్నా ఇన్‌సల్టు ఇంకేం కావాలి నాకు?"

"ఛ! ఏడవకు. నిన్ను ఇన్‌సల్టు చేయడం నా అభిమతం కాదు. నా కోరికని, లక్ష్యాన్ని సాధించటమే నాకు కావలసింది. ఏడవకు."

"నేనంటే ప్రేమ లేదా? ఈ మూడేళ్ళలో నన్ను పెళ్ళి చేసుకోవాలని ఒక్కసారైనా అనుకోలేదా?"

"ఏమో?"

"నిజం చెప్పండి. అనుకోలేదా?"

"నాకు తెలియదు."

"మరైతే మీరెందుకు ఏడుస్తారు?"

తన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయని గ్రహించాడు పరాంకుశం. మొహం పక్కకి తిప్పుకుని తుడుచుకుని అన్నాడు.

"అయామ్ ఆఫుల్లీ సారీ అమ్మాజీ."

బైటకి వెళ్ళిపోయింది అమ్మాజీ. రాత్రి గది ఖాళీచేస్తున్నట్లుగా చెప్పాడు పరాంకుశం, అమ్మాజీ తండ్రికి. ఆయన ఏం ప్రశ్నలూ వేయలేదు - 'ఎందుకు ఖాళీ చేస్తున్నావు?' లాంటివి. ముందు చెప్పనందుకు నెల అద్దె ఇవ్వమని, ఒకవేళ ఇంటికి ఎవరైనా అద్దెకి వస్తే తిరిగి ఆ డబ్బు ఇచ్చేస్తానని చెప్పాడు.

అమ్మాజీ తల్లి తనని పురుగుని చూసినట్టు చూడటం గమనించి అనుకున్నాడు అమ్మాజీ తల్లిదండ్రులతో తన పెళ్ళి సంగతంతా చెప్పేసిందని.

ఆ రాత్రి చాలాసేపు ఆలోచిస్తుండిపోయాడు తను చేస్తున్న పనిని గురించి.

ఆశించదగ్గ, ఆశలు పెంచుకున్న అమ్మాజీని వదిలి, ఆకలి తీర్చే వ్యాపారం చేసే ఒక అభాగ్యురాలిని ఎన్నుకోవటం ఎంతవరకు సరైనది?

ఆ రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు పరాంకుశానికి. ఎంతసేపూ అమ్మాజీ వైపు కన్నా సౌదామిని వైపే మొగ్గింది మనసు. బహుశా ఈ ఇరవై ఆరేళ్ళ జీవితంలో తొమ్మిదేళ్ళ నుంచి చేద్దామనుకుని, బలపరచుకున్న ఆ ఆదర్శమే అందుకు కారణం అని అర్థం చేసుకున్నాడు.

మర్నాడు ఉదయం గది ఖాళీ చేశాడు.

"అమ్మాజీ. నన్ను క్షమించి. నా మీద ఆశలు పెంచుకుంటున్నావని తెలిసి వారించడానికి ప్రయత్నించి విఫలుడయ్యాను. నిన్నిలా వదిలి వెళ్ళడం బాధగా ఉన్నా తప్పదు. నిజంగా నువ్వెంతో మంచిదానివి. నాకా అదృష్టం లేదు. ఎవడో అదృష్టవంతుడు ఎక్కడో పుట్టి నీకోసం ఉన్నాడు. వాడు వెతుక్కుంటూ వచ్చాక నాకు తెలియపరుస్తావు కదూ."

అమ్మాజీ నిర్లిప్తంగా నవ్వింది.

"ఆగమనం వెంట నిర్గమనం కూడా ఉంటుంది. రాకని అంటిపెట్టుకుని పోక ఉంటుంది. పోతున్నాను."

"గుడ్ బై అండ్ గుడ్ లక్. గుడ్ లక్ టు బోత్ ఆఫ్ యు." చెప్పింది అమ్మాజీ.

"భారంగా ఉంది హృదయం." బాధగా చెప్పాడు పరాంకుశం.

జట్కా బండి కదులుతూంటే. గుండెలు ఎవరో పట్టి నొక్కినట్లుగా ఫీలయ్యాడు పరాంకుశం.

✷✷✷

ఇన్స్పెక్టర్ తన పై అధికారి డిసిపితో పరాంకుశం వ్యవహారం వివరంగా చెప్పాడు. ఆయన ఆసక్తిగా విన్నాడంతా.

"ఓ! అతను చేసేది మంచి పనే. సహాయం చేయి. ఇలాంటి వారిని మనం ప్రోత్సహించాలి. అతని ఏంటీసిండెంట్స్ జాగ్రత్తగా విచారించు. అతను సిన్సియర్ అవునో కాదో తెలుసుకున్నావా? లేకపోతే మనం తర్వాత అభాసుపాలవుతాం." అడిగాడు డిసిపి.

"విచారించాను సార్. కల్తీలేని మనిషని తెలిసింది."

"వెరీ గుడ్ గో హెడ్ అతనికి ఏం సహాయం కావాలన్నా చేయి." అభ్యుదయవాది అయిన ఆ డిసిపి చెప్పాడు.

✷✷✷

కొత్త ఇంట్లో అరగంటలో సామానంతా సర్దేసి బస్స్టాండ్కి వెళ్ళాడు పరాంకుశం. అరగంట తర్వాత వచ్చింది అక్కా బావలు ఉండే ఊరు నుంచి వచ్చే బస్సు.

పరాంకుశాన్ని చూసి ఆనందంగా బస్సులోంచే చెయ్యి ఊపింది అక్కయ్య. బస్సు పైనుంచి పెద్ద పెట్టెలు రెంటిని కూలీ దింపాడు.

"నువ్వు కోరినట్లుగానే ఆరునెలలు ఉండటానికి సరిపడ సామానుతో వచ్చాను." నవ్వి చెప్పింది అతని అకరిఞ జాయ.

"థాంక్స్"

"నాక్కాదు.మీ బావగారికి చెప్పు. మా పెళ్ళయ్యాక మేం ఇంతకాలం దూరంగా ఉండటం ఇదే మొదటిసారి. నీకు ప్రోత్సాహం ఇవ్వడానికే ఆయన నాకు అనుమతిని ఇచ్చింది."

కుశల ప్రశ్నలు అయ్యాక ఇంటికి జట్కాలో వెడుతూ అడిగింది పరాంకుశం అక్కయ్య.

"ఇల్లు అద్దెకు తీసుకున్నావా లేదా ఇంకా?"

"ఈ వేళే తీసుకున్నాను."

"ఎలా ఉంటుంది?"

"బావుంది. నీకు నచ్చుతుంది. ముందు వెనక చిన్న తోట.."

"నే అడిగింది నీ కాబోయే అర్ధాంగి గురించి"

"చూస్తావుగా." చెప్పాడు కొద్దిగా సిగ్గుగా మొహం తిప్పుకుని.

"ఎన్నేళ్ళు?"

"పద్దెనిమిది."

"ఈడే"

మౌనంగా ఉండిపోయాడు పరాంకుశం.

"ఎప్పుడు ఆ అమ్మాయిని తీసుకువచ్చేది?"

"ఈ రాత్రికి."

"ఓ? ఈ రాత్రికేనా?"

"అవును."

దూరంనుంచే ఇల్లు చూసి చెప్పింది.

"నువ్వన్నట్లుగానే ఇంటినిండా పూలమొక్కలతో బాగుందే ఇల్లు,"

ఇంట్లోని సామాను చూసి అడిగింది ఆశ్చర్యంగా.

"ఇంతేనా సామాను? ఈ కాస్త ఏం చాలుతుంది?"

"నువ్వే చూసి ఏం కావాలో లిస్టు రాసుకో."

"అయితే బజారుకు పోదాం, పద."

ప్రయాణం చేసి వచ్చిన ఆమె స్నానం చేసాక పరాంకుశం, పరాంకుశం అక్కయ ముందర బేంక్‌కి వెళ్ళారు. పరాంకుశం అకౌంట్లోంచి వెయి రూపాయలు తీసుకున్నాక, మధ్యాహ్నం రెండు దాకా వివిధ వస్తువులు కొంటూ తిరుగుతూనే ఉన్నారు.

"రాత్రి నుంచి ఇంక హోటల్ భోజనం మానేయొచ్చు. పాలు పొంగించగానే శుభ్రంగా వండి పెడతాను."

"బావేమన్నారు?" అడిగాడు పరాంకుశం.

"ఒకింటివాడివి అవుతున్నందుకు సంతోషపడ్డారు. రిజిస్టర్ మారేజేగా?"

"అవును".

"బహుశా పెళ్ళికి రాకపోవచ్చు. ఆఫీసులో పని ఎక్కువగా ఉందిట."

సాయంత్రం శ్రీకంఠం ఆఫీస్ నుంచి వచ్చాడు. పరాంకుశం అక్కయ్యతో పూర్వ పరిచయం ఉండటం వల్ల కుశల ప్రశ్నలు లాంటి ఫార్మాలిటీస్ పూర్తిచేసుకుని చెప్పాడు పరాంకుశంతో.

"ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి వస్తున్నాను. చీకటి పడ్డాక వెళుతున్నాం అక్కడికి. గుట్టుచప్పుడు కాకుండా అయిదు నిమిషాల్లో జరిగిపోవాలి అంతా, రెయిడ్‌కి వెళ్ళినట్లు వెళతారు."

"అలాగే!"

"నేను ఇంటికి వెళ్ళి ఓ గంటలో వస్తాను మళ్ళీ. నువ్వు సిద్ధంగా ఉండు." శ్రీకంఠం వెళ్ళిపోయాడు.

✷✷✷

స్టేషన్ నుంచి అంతా పోలీస్ వేన్ ఎక్కి ఆ సందుకి బయలుదేరారు. పరాంకుశం గుండెలు కొట్టుకుంటున్నాయి, పోలీస్ వేన్ ఎక్కి ఆ సందులోకి తిరగగానే. వేన్ కిటికీ లోంచి బయటికి చూసాడు. పోలీస్ వ్యాన్‌ను గమనించి అంతా గగ్గోలుగా పరుగెత్తుతున్నారు.

సౌదామిని తనతో రావడానికి ఒప్పుకుంటుందా?

వాన్ ఆగింది.

"దిగండి."

భుజం తట్టి చెప్పాడు ఇన్స్పెక్టర్ పరాంకుశంతో.

పోలీసులతో పాటు దిగి, వాళ్ళతో పాటు లోపలికి పరుగెత్తాడు.

"ఏమిటి? మామూలు అందలేదా?"

కుంటివాడు బిత్తరపోతూ అడిగాడు.

సమాధానం ఇవ్వకుండా సౌదామిని గదివైపు వెళ్ళాడు. లోపల అద్దం ముందు కూర్చుని తీరికగా జడ వేసుకుంటోంది సౌదామిని. పక్కన కాలుతున్న సిగరెట్.

అద్దంలోంచి పోలీస్ ఇన్స్పెక్టర్ని చూసి కుదుటపడింది.

"ఏం బుల్లోడా?" అన్నది కన్ను గీటి చిన్నగా నవ్వుతూ.

"పద." చెప్పాడు పరాంకుశం.

"ఎక్కడికి?" అడిగింది.

"మా ఇంటికి."

"నిజంగా?"

"అవును. ఇతన్ని పెళ్ళిచేసుకోవడం నీకు ఇష్టమేనా?" అడిగాడు ఇన్స్పెక్టర్ ఆమెని.

"ఇష్టమే."

"ఐతే పద." తొందర చేసాడు పోలీస్ ఇన్స్పెక్టర్.

క్షణాల మీద బయటపడ్డారు.

"దాన్నెక్కడికి తీసుకువెళుతున్నారు?" అడిగాడు కుంటివాడు కుంటుకుంటూ.

ఎవరూ సమాధానం చెప్పలేదు. వాన్ స్టార్ట్ అయింది.

"డిఎస్పి అనుమతితో నేను ఈ పని చేస్తున్నానని వాడికి తెలీదు." నవ్వి చెప్పాడు ఇన్స్పెక్టరు.

✷✷✷

"అబ్బో! చాలా పెద్ద ఇల్లేనే?" సంతోషం, ఆశ్చర్యం కలబోసి అన్నది సౌదామిని.

"అవును. మనం హాయిగా ఉండవచ్చు."

గేటు దాటి, ఇంట్లోకి వెళుతూ చెప్పాడు పరాంకుశం.

"నువ్వు అదృష్టవంతురాలివి. ఇక నువ్వు నీ పాత జీవితాన్ని మరిచిపోవాలి. పూర్తిగా ఇప్పటినుంచి ఓ ఇంటి ఇల్లాలివిగా నడుచుకోవాలి." వెళుతూ చెప్పాడు ఇన్స్పెక్టర్.

"రామ్మా." ఆప్యాయంగా ఆహ్వానించింది పరాంకుశం అక్కయ్య.

"నా అక్కయ్య. ఊరు నుంచి ఉదయమే వచ్చింది. నమస్తే చెప్పాలి పెద్దవాళ్ళకి."

కొద్దిగా విసురుగా చూసింది పరాంకుశం వంక. నమస్కారం చెయ్యలేదు. పరాంకుశం మొహంలోని కోప రేఖలను గమనించి చెప్పింది పరాంకుశం అక్కయ్య.

"స్నానం చెయ్యమ్మా. వేణ్ణీళ్ళు కాగబెట్టాను. అమ్మాయికి గది చూపించరా."

శ్రీకంఠం వస్తాడనుకున్నాడు పరాంకుశం ఆ రాత్రి రాలేదు.

"నాకు బయట వెయ్యక్కా పక్క హాయిగా ఉంటుంది బయట." చెప్పాడు.

"అలాగే" అన్నది పరాంకుశం అక్కయ్య నవ్వి.

"నాకు బయట పడుకుంటే చలేస్తుంది." చెప్పింది సౌదామిని.

"నువ్వు లోపలే పడుకో." చెప్పాడు పరాంకుశం.

"మరి నువ్వో?"

విచిత్రంగా చూసింది పరాంకుశం కళ్ళల్లోకి.

"నా దగ్గర పడుకోవా?"

"ఊహూఁ!"

"మరి నన్ను తెచ్చుకున్నది దేనికి బుల్లోడా?"

అక్కయ్య ముందు పరాంకుశం సిగ్గుతో కుచించుకుపోయాడు.

"పెళ్ళయ్యేదాకా దూరంగా ఉండాలి." చెప్పాడు కఠినంగా.

"ఓహో! పెళ్ళా! అవును, పెళ్ళన్నావుగా." కాస్సేపాగి అడిగింది.

"మరయితే ఎప్పుడు పెళ్ళి?"

"త్వరలోనే."

"తొందరగా చేసుకుందాం, బుల్లోడా. ఓ సిగరెట్ పడేయి నాకు."

"సిగరెట్ తాగుతుందా?"

పరాంకుశం అక్కయ్య అడిగింది ఆశ్చర్యంగా.

పరాంకుశం లేచి సౌదామిని గదిలోకి వెళ్ళిపోయాడు వెంటనే. వెనకాలే సౌదామిని వస్తుందని తెలుసు. వచ్చింది.

"నాకు ఓ పాకెట్ ఇవ్వు. అయిపోయాక అడుగుతాను మళ్ళీ."

"సిగరెట్ లేదు, గిగరెట్ లేదు."

"ఏయ్. ముందర ఏం చెప్పావు బుల్లోడా? గుర్తు తెచ్చుకో. పడేయి పాకెట్." చెయ్యి చాపింది సౌదామిని.

"నువ్వు సిగరెట్ తాగకూడదు."

"మరి నువ్వు తాగచ్చేంటి?"

"తాగచ్చు. ఆడవాళ్ళు తాగకూడదు."

"అబ్బో ఎంత పెద్ద మొగాడో..."

అశ్లీలం అలవాటైపోయింది సౌదామినికి.

"సౌదామినీ! దయచేసి ఇంకెప్పుడూ బూతు మాటలు మాట్లాడకు."

"బూతు పనులు చేస్తే తప్పులేదు కానీ, మాట్లాడితే తప్పా?"

"అసహ్యంగా ఉంటుంది వినడానికి."

"అలవాటే మరి, అయినా, నేను చెప్పిన షరతులు మరిచిపోయావా? నువ్వెవరు నన్ను శాసించడానికి..."

"నోరు మూసుకో." కోపంగా అరిచాడు.

"నీ దగ్గర మాటలు పడటానికి రాలేదు. ఇష్టం లేకపోతే చెప్పు. మహారాణిలా వెళ్ళిపోతాను."

"పరాంకుశం."

అక్కయ్య పిలుపు విని బయటికి వచ్చాడు. దూరంగా బావి దగ్గర నిలుచుని ఉంది.

"ఆ అమ్మాయి పెరిగిన వాతావరణం వేరు. నెమ్మదిగా మార్చుకోవాలి కాని అలా శాసించి ప్రయోజనం లేదు. ఆ అమ్మాయి మీద కోప్పడటానికి నీకేం అధికారం ఉంది?"

"అదికాదక్క..."

"పోయి పడుకో." కొంగుతో చేతులు తుడుచుకుంటూ చెప్పింది.

ఆ ఆజ్ఞలో చాలా అర్థాలు గ్రహించాడు పరాంకుశం.

"గంటయినా అవలేదు వచ్చి. అప్పుడే పోట్లాట?, తిక్కది కోపం వస్తే లేచిపోతుంది. నెమ్మదిగా చెప్పి మార్చుకోవాలి ఇలాంటివి."

"అలాగే." బైటకి నడిచాడు పరాంకుశం. గొణుగుతూనే ఉంది సౌదామిని. అక్క చెప్పిన బోధ గురించి ఆలోచించాడు. అది సబబనిపించింది. ఆ అమ్మాయి మీద కోపం తెచ్చుకోకూడదని అనుకున్నాడు.

ఓ రాత్రివేళ మెలుకువ వచ్చింది పరాంకుశానికి. ఆవలిస్తూ మంచం మీద లేచి కూర్చుని చప్పుడైన వైపు చూసాడు .

ప్రహరీ గోడమీద ఇద్దరు, గోడదూకి ఇవతలి వైపు తోటలో ఇద్దరు. పరాంకుశం చూస్తుండగానే మిగతా ఇద్దరు కూడా లోపలికి దూకారు. నలుగురూ మెల్లగా పరాంకుశం వైపు రాసాగారు. పరాంకుశానికి అర్థమయింది ఆ నలుగురూ దొంగలని. గబుక్కున లేచి తలుపు వైపు గెంతాడు.

"అక్కయ్యా! త్వరగా తలుపు తెరు." తలుపు బాదుతూ చెప్పాడు.

పరాంకుశానికి తెలుసు అక్కయ్యకి త్వరగా మెలుకువ రాదని. బావ తను ఎప్పుడైనా మిడ్‌నైట్ షోకి వెళితే ఆ రాత్రి ఎన్నిసార్లో అరిస్తేగాని అక్కయ్యకి మెలుకువ వచ్చేది కాదు.

గబగబా తలుపు బాదుతూనే ఉన్నాడు భయంగా.

ఆ నలుగురూ పరాంకుశం లేచి తలుపు తట్టడం గమనించి పరుగెత్తుకు రాసాగారు పరాంకుశం వైపు. నలుగురి చేతుల్లో కర్రలున్నాయి.

వాళ్ళు పదడుగుల దూరంలో ఉండగా తలుపు తెరుచుకుంది. ఎదురుగా సౌదామిని ఉంది తలుపుకవతల. పరాంకుశాన్ని, వస్తున్న ఆ నలుగురినీ చూసి పరాంకుశం చెయ్యి పట్టుకుని లాగి, తలుపు లోపల గడియ వేసింది.

"రౌడీ బాలాజీ వచ్చాడు మరో ముగ్గురితో." చెప్పింది పరాంకుశం చెవిలో.

"ఎవరు ఆ రౌడీ?"

"మా సందులో ఉంటాడులే. వాడే"

"ఒరేయ్. పరాంకుశం! వెంటనే తలుపులు తెరిచి సౌదామినిని అప్పగించు. లేదా తలుపు బద్దలు కొట్టి తీసుకువెళతాం."

తలపుల మీద బాదసాగారు గట్టిగా.

"పోలీసుల సాయంతో తీసుకుపోతావేం? అయిదువేలిచ్చి కొన్నాం, తెలుసా?"

" ఏమిటిరా? ఏమిటి గొడవ?" అడిగింది పరాంకుశం అక్కయ్యకి మెలుకువ వచ్చి లేచి.

"తలుపు తియ్యరా లం..."

రౌద్రంగా గర్జిస్తున్నారు తలుపుకి అవతలి వైపు నుంచి కిల కిలా నవ్వింది సౌదామిని.

"నన్ను తీసుకెళ్ళడానికి వచ్చారు." చెప్పింది.

భయంగా చూసింది పరాంకుశం అక్కయ్య. చేతి గడియారం వంక చూసుకున్నాడు. రెండూ నలభై అయింది.

తెల్లవారడానికి నాలుగయిదు గంటలవుతుంది. ఈ లోపల వాళ్ళు తలుపులు పగలకొడితే ఎలా?

"నువ్వు వెనక వైపు నుంచి వెళ్ళి పోలీసులని తీసుకురా." పరాంకుశం అక్కయ్య రహస్యంగా చెప్పింది.

"తలుపు తీస్తే లోపలికి జొరబడతారు. అటువైపు కూడా ఎవరయినా ఉన్నారేమో" భయంగా చెప్పాడు పరాంకుశం.

"మరేం చేద్దాం. ఆ దెబ్బలకి తలుపులు ఎక్కువసేపు ఆగవు."

భయంగా అలాగే చేష్టలుడిగినట్లుగా ఉండిపోయారు అక్క, తమ్ముడు. సౌదామిని భయపడకుండా మామూలుగానే ఉంది. ఆమెకి అది వినోదంగా కూడా ఉంది.

కొన్ని నిమిషాల తర్వాత తలుపు మీద బాదుడు ఆగిపోయింది. ఏవో మాటలు వినబడ్డాయి. చాలా గొంతులు ఇప్పుడు.

"ఇంకా చాలామంది వచ్చినట్లున్నారు." చెప్పాడు పరాంకుశం భయంగా.

కొన్ని క్షణాల తర్వాత తలుపు మీద మృదువుగా కొట్టారు ఎవరో తలుపుని.

"పరాంకుశంగారూ, తలుపు తెరవండి."

పరిచయం ఉన్న కంఠమే అది. అయినా, ఎవరిదో గుర్తు రాలేదు.

"ఎవరు?" అడిగాడు పరాంకుశం.

"ఇన్స్పెక్టర్‌ని. భయంలేదు, తలుపు తెరవండి."

పరాంకుశం తలుపు తీశాడు. అవతల రౌడీలు నలుగురు తలలు వంచుకుని నుంచుని ఉన్నారు. చేతులు వెనక వీపుకి ఆనించి కట్టేసి ఉన్నాయి. వారి చేతిలోని కర్రలు కిందపడి ఉన్నాయి. పక్కన పోలీసులు నుంచుని ఉన్నారు.

చిన్నగా నవ్వుతూ లోపలికి వచ్చాడు ఇన్స్పెక్టర్.

"నాకు తెలుసు, ఆ కుంటివాడు ఊరికే కూర్చోడని. ఎందుకయినా మంచిదని ముందరే ఇద్దరిని మఫ్టీలో మీ ఇంటి బయట కాపలా పెట్టాను. నా అనుమానం నిజమైంది. వాళ్ళలో ఒకడు వచ్చి నాకు తెలియచేసాడు వీళ్ళ దాడి సంగతి."

"థాంక్స్. మీరు సమయానికి రాకపోతే ఏమయ్యేవాళ్ళమో?" చెప్పింది పరాంకుశం అక్కయ్య రెండు చేతులు జోడించి.

"వీళ్ళు మళ్ళీ ఇంకోసారి ఇలా చేయకుండా గట్టి చర్యలు తీసుకుంటాను." చెప్పాడు ఇన్స్పెక్టర్.

ఇన్స్పెక్టర్ బయట ఆగివున్న వాన్‌లో దోషులను ఎక్కించుకుని వెళ్ళిపోయాడు.

"ఇకనుంచి బయట పడుకోకు. లోపలే పడుకో." చెప్పింది పరాంకుశం అక్కయ్య.

"నా గదిలో చోటుంది." వెకిలిగా నవ్వి చెప్పింది సౌదామిని.

"నువ్వు లోపలికి వెళ్ళమ్మా."

పరాంకుశం అక్కయ్య మందలించింది. మూతి ముడుచుకుని పరాంకుశం వంక కోపంగా చూసి, లోపలికి వెళ్ళిపోయింది సౌదామిని.

జారిపోతున్న చవకరకం ఉల్లిపొర నైలాన్ ఓణీ, ఒక పాత మాసిపోయిన పొట్టి లంగా, ఒంట్లోని ఒంపులని స్పష్టం చేసే బట్టలు, ముఖాన మందంగా పౌడర్. వదులుగా వేసుకున్న జడలో వాడిపోయిన మల్లెలు. ప్రతి కదలికలో, చూపులో, నడకలో, మాటలో తెచ్చిపెట్టుకున్న హొయలు, ఒయ్యారం.

సౌదామినిని చూస్తే ఎవరికయినా తెలిసిపోతుంది ఎలాంటి మనిషో.

"అక్కయ్యా! సౌదామిని చేత రేపటి నుంచి చీర కట్టించు. లేదా ఓణీ ఎలా వేసుకోవాలో నేర్పించు." చెప్పాడు పరాంకుశం.

చిన్నగా నవ్వి చెప్పింది పరాంకుశం అక్కయ్య.

"సౌదామినికి చాలా నేర్పించాలి. దుస్తులు మారినంత మాత్రాన మనిషి మారిపోదు. మాటలు, చూపులు, నడక, చివరికి ప్రతి చిన్న కదలిక కూడా నేర్పాలి."

"ముఖ్యంగా ఆ వెకిలి నవ్వు, ఆకలి చూపులు మానిపించాలి. ఒళ్ళు మండుతుంది నాకు."

"పడుకో, ఇంకాస్సేపయితే తెల్లవారుతుంది కూడా. నిద్ర చెడిపోయింది అందరికీ."

పడుకోగానే వెంటనే ఇద్దరికీ నిద్రపట్టింది.

✷✷✷

*(తరువాయి భాగం వచ్చే సంచికలో)*

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..

**Click here to go to KOUMUDI Library**

